అర్ధరాత్రి నుంచి అరెస్టులు

పోలీస్‌స్టేషన్‌కు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గిరిజన, విద్యార్థి నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకుల తరలింపు

సుబేదారి, నవంబర్ 19 : సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా పోలీసులు సోమవారం అర్ధరాత్రి నుంచే బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, గిరిజన సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం మొదలు పెట్టారు. వరంగల్ నగరంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు రాత్రి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, విద్యార్థి సంఘాల నాయకుల ఇళ్లకు వెళ్లి అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. వరంగల్ నగరంలోని మిల్స్‌కాలనీ, ఇంతేజార్‌గంజ్, మట్టెవాడ, మామునూరు, హనుమకొండ, కేయూసీ, సుబేదారి, కాజీపేట, మడికొండ, నగర శివారు ప్రాంతాలైన దామెర, ఆత్మకూర్, ధర్మసాగర్, హసన్‌పర్తి, గీసుగొండ, సంగెం పోలీసు స్టేషన్ల పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను అరెస్ట్ చేశారు. లంబడా హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు వెంకట్‌నాయక్‌తోపాటు మరింకొందరిని సుబేదారి పోలీసులు అరెస్ట్ చేశారు. హనుమకొండ పోలీసులు బీఆర్ఎస్వీ నాయకులు కంజర్ల మనోజ్, సుమన్‌ను తెల్లవారుజామునే అరెస్ట్ చేశారు. మడికొండ పోలీసులు ఆరూరి రంజిత్‌తోపాటుగా మరికొందరిని అరెస్ట్ చేశారు.

నడికూడ: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచులు

ఇదేనా ప్రజా పాలన?

శాయంపేట: పోలీసులు బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ ఇదేనా ప్రజా పాలన? అంటూ ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి 11 నెలల కాలంలో ఏం సాధించారని వరంగల్ పర్యటనకు వచ్చారని నిలదీశారు. విద్యార్థి నాయకులకు భయపడి అర్ధరాత్రి 2గంటలకే అరెస్ట్ చేయడం సిగ్గుచేటు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగిస్తున్నారని, 11 కాలంలోనే ఉద్యమ నాయకులకు, విద్యార్థులకు భయపడితే నాలుగేండ్లు రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తారని ప్రశ్నించారు. ఉద్యమకారులు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేసి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్ట్

నడికూడ/ఆత్మకూరు: పరకాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిలో మాజీ సర్పంచులు ఊర రవీందర్‌రావు, తిప్పర్తి సాంబశివరెడ్డి, రాజన్న, సదానందం, గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతు గోపు రవీందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్, బహుజన స్టూడెంటు యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్, మచ్చ పవన్ కల్యాణ్ ఉన్నారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌కు వస్తున్నారని సోమవారం అర్ధరాత్రి బీఆర్ఎస్ మాజీ సర్పంచ్‌లు, నాయకులను పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేయడాన్ని బీఆర్ఎస్ ఆత్మకూరు మండల కమిటీ మంగళవారం తీవ్రంగా ఖండించింది. దౌర్జన్యంగా అరెస్ట్ చేస్తే, ప్రజలు తిరుగబడతారని వారు అన్నారు.

బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు..

ఐనవోలు: ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికమని జడ్పీ మాజీ కోఆప్షన్ మెంబర్ ఉస్మాన్‌అలీ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హనుమకొండ జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మంగళవారం ఎస్సై పస్తం శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకుడు, పంథిని మాజీ సర్పంచ్ బరిగెల సదానందం, మండల కోఆప్షన్ మెంబర్ గుంషావళి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు బొక్కల నారాయణ, బరిగెల వెంకటస్వామిలను ముందస్తుగా అరెస్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం హేయమైన చర్య అని నాయకులు పేర్కొన్నారు. కాగా, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులను ముందస్తు అరెస్ట్‌లను నిరసిస్తూ నందనంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు నిరసన తెలిపారు. సీఎం సభలో ఎస్సీ వర్గీకరణపై నిలదీస్తారనే భయంతోనే నాయకులను పోలీసులతో ముందస్తు అరెస్టులు చేయించడం అప్రజాస్వామికం అన్నారు. బాబు, ఎల్లకుమార్, సుదర్శన్ ఉన్నారు.

ఐనవోలు: ముందస్తు అరెస్టులను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాస్

ఐనవోలు: నందనంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

సుబేదారి: అరూరి రంజిత్‌ను అరెస్ట్ చేసిన మడికొండ పోలీసులు

శాయంపేట : ఎస్సై అదుపులో బీఆర్ఎస్వీ నేత శివ

ఆత్మకూరు: పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు

జాతీయ పోటీలకు ఎంపికైన స్విమ్మర్లు

ఎంపికైన స్విమ్మర్లను అభినందిస్తున్న డీవైఎస్‌వో అశోక్‌కుమార్, కోచ్ నవీన్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: ఈనెల 24 నుంచి 30 వరకు గుజరాత్‌లో జరిగే 68వ జాతీయ స్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ చాంపియన్‌షిప్‌కు వరంగల్ అకుమ్ కాలేజీలో చదువుతున్న డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ప్రాక్టీస్ చేస్తున్న బోడిక ఆర్యాచంద్రారావు, బోడిక ఆర్యచక్రాధర్‌రావు ఎంపికైనట్లు డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్, స్విమ్మింగ్ కోచ్ రాయబారపు నవీన్ తెలిపారు. వారిని హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలోని డీవైఎస్‌వో ఆఫీస్‌లో అభినందించారు. సీనియర్ జమ్నాస్టిక్ కోచ్ నరేందర్, కోచ్ ఉన్నారు.

వేయిస్తంభాల గుడిలో సంకటహర చతుర్థి పూజలు

ఉత్తిష్ట గణపతికి పూజలు చేస్తున్నగంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల ఆలయంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ఉత్తిష్ట గణపతికి పంచామృత నవరసాభిషేకం, గరికపూజ నిర్వహించారు. ఆలయ నాట్యమంటపంలో 11 మంది వేదపండితుల ఆధ్వర్యంలో పుట్టమట్టి లింగాలతో ప్రత్యేక పూజలు చేసినట్లు ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. వరంగల్ జిల్లా దేవాదాయ, ధర్మాదాయశాఖ 5వ జోన్ ఉపకమిషనర్ టి.శ్రీకాంతారావు పాల్గొన్నారు. శ్రీనివాసరావు దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. వేదపండితులు జోషిభరత్‌శర్మ, పల్లి మణికంఠశర్మ, గుమ్మడవెల్లి ఆశ్రిత్‌శర్మ, గంగు మణికంఠశర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.వెంకటయ్య పూజలు నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుక్కయ్య

అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంచాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కయ్య

కాజీపేట, నవంబర్ 19: అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కయ్య అన్నారు. కాజీపేటలో పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం మండల కమిటీ సభ్యుడు ఓరుగంటి సాంబయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలోని న్యూ శాయంపేటలో దళితుల అసైన్డ్ భూమిని గత ప్రభుత్వం తీసుకుని 1500 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించిందన్నారు. పూర్తయిన ఇళ్లను పంచకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. పేదలు అద్దెలు కట్టలేక పోతున్నారని తెలిపారు. భూమి కోల్పోయిన దళితులకు వెంటనే పంచాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు జంపాల రమేశ్, సంటి రవి, తుట్టే మల్లేశం, కారు ఉపేందర్, రామంచ సారంగపాణి, విమల, రాజేశ్వరి పాల్గొన్నారు.

హామీల అమలును దాటవేస్తున్న కాంగ్రెస్ సర్కార్

మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి

శాయంపేట, నవంబర్ 19 : ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై దాటవేస్తోందని, ఆ హామీల అమలుకు ప్రజా పోరాటాలు చేపడతామని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తిరుపతి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారంలో సీపీఎం శాఖ మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలేదన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం ప్రకటనలతోనే పబ్బం గడుపుతోందన్నారు. కాగా, సీపీఎం శాయంపేట (ప్రగతి సింగారం) శాఖ కార్యదర్శిగా చిలకల కొమురయ్యను ఎన్నుకున్నట్లు తిరుపతి తెలిపారు. కమిటీ సభ్యులుగా మాదాసు తిరుపతి, బల్ల రవి, కొమురయ్య, ఎల్లయ్యను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. రాజయ్య, సమ్మయ్య, వెంకటయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

నూతన విద్యావిధానం రద్దుకు పోరాడుదాం

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'విద్యారంగ సమస్యలు – భవిష్యత్ కార్యాచరణ' అనే అంశంపై విద్యార్థుల సదస్సు కాకతీయ యూనివర్సిటీలోని బాటనీ సెమినార్‌హాల్‌లో నిర్వహించారు. డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ అధ్యక్షత వహిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే స్ఫూర్తితో నూతన జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ)-2020 రద్దు కోసం పోరాడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ముఖ్యవక్తలుగా విచ్చేసిన డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటదాస్ హాజరై మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల రాకతో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమవుతుందని, కామన్ స్కూల్ విద్యావిధానం, శాస్త్రీయ విద్య, ఉచిత నిర్బంధ విద్యను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ సదస్సుకు డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థి సభ్యులు, వివిధ విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీసీకి వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు

కేయూ వీసీని కలిసిన పార్ట్ టైమ్ అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: కాకతీయ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. ఫుల్ వర్క్‌లోడ్‌తో ఉన్న అందరికీ మినిమం టైం స్కేల్‌గా మార్చాలని, ఈనెల 25న మధ్యాహ్నం 2 తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం టీచర్స్ అసోసియేషన్ టీజీ ఆప్ట్ (టీజీ ఆప్ట్) రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ ప్రాంగణంలోని జాఫర్ నిజాం హాల్‌లో జరుగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ తెలిపారు. అన్ని యూనివర్సిటీల ప్రతినిధులు పాల్గొంటారని, పార్ట్‌టైమ్ అధ్యాపకుల సమస్యల పరిష్కారం మినిమం టైమ్స్ స్కేల్ కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని పార్ట్ టైమ్ అధ్యాపకులు అందరూ పాల్గొనాలని కోరారు. జనరల్ సెక్రటరీ డాక్టర్ నాగేశ్వరరావు, మోహన్, కుమార్‌స్వామి, లక్ష్మీనారాయణ, సాహితీ, సుభాష్, లక్ష్మణ్, రవీందర్, రమేశ్, శ్యాంసుందర్, చారి పాల్గొన్నారు.

నార్కోటిక్స్ పోలీసు స్టేషన్ ప్రారంభం

సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నార్కోటిక్స్ డైరెక్టర్ సందీప్‌శాండిల్య

సుబేదారి, నవంబర్ 19: ములుగు రోడ్డులో ఏర్పాటు చేసిన నార్కోటిక్ పోలీస్ స్టేషన్‌ను మంగళ వారం వరంగల్ నగర పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి హనుమకొండ బాలసముద్రం కాళోజీ కళా క్షేత్రం ప్రాంగణంలో వర్చువల్ పద్ధతి లో ప్రారంభించారు. నార్కోటిక్స్ విభాగం డైరెక్టర్ సదీప్ శాండిల్య, శాంతిభద్రత అదనపు డీజీపీ మహేశ్ భగవత్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పాల్గొన్నారు. కాగా, నార్కోటిక్ పోలీసు స్టేషన్‌లో డైరెక్టర్ సందీప్ శాండిల్య విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నార్కోటిక్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. డ్రగ్స్ నియంత్రణకు ఉమ్మడి వరంగల్ జిల్లా, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు కలిపి వరంగల్‌లో నార్కోటిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయించిన, సేవించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిరంతరం నిఘా పెట్టి మత్తు పదార్థాలను పట్టుకుంటామని చెప్పారు. నార్కోటిక్ ఎస్పీ సాయిచైతన్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా

సుబేదారి, నవంబర్ 19: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనను నిరసిస్తూ సౌత్ ఇండియా స్టూడెంట్ ఆర్గనైజేషన్, ఎస్ఐఎస్ఓ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండ అదాలత్ కాళోజీ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి కాళోజీ కళా క్షేత్రం ఆవిష్కరించే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. కళాక్షేత్రం వద్ద కళాకారుల విగ్రహాలు పెట్టకుండా ప్రారంభించడం తగన్నారు. కళాకారులకు న్యాయం జరిగే వరకు, కళాకారుల విగ్రహాలు పెట్టేవరకు పోరాటం చేస్తామన్నారు. కన్నం సునిల్‌తో పాటు ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్, మణితేజ, శివ, సిద్దును పోలీసులు అరెస్ట్ చేసి కేయూ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటనున్న బీఆర్ఎస్

మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా

దామెర, నవంబర్ 19: వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తాచాటుతుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో దామెర, ఆత్మకూరు మండలాల బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత, అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనతికాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను చవిచూస్తున్నదన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు ఎక్కడికక్కడే ఎండగడుతున్నా ఆ పార్టీ తీరు మారడం లేదన్నారు. వచ్చే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్ఎస్ వైపు ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలను సమన్వయం చేస్తూ సమావేశాలను నిర్వహించి పంచాయతీ ఎన్నికలకు సిద్ధం చేయాలని సూచించారు. పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను బొందపెట్టి, బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, బొల్లెబోయిన రవి యాదవ్, సావురే రాజేశ్వర్‌రావు, కాంతాల కేశవరెడ్డి, గండు రామకృష్ణ, ముదిగొండ కృష్ణమూర్తి, ఎండీ జాకీర్‌అలీ, పోలెం కృపాకర్‌రెడ్డి, దాడి మల్లయ్య, గరిగె కృష్ణమూర్తి, పున్నం సంపత్, బొల్లు రాజు పాల్గొన్నారు.

నిర్బంధాలకు భయపడేది లేదు

బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిర్బంధాలు భయపడబోమని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ హెచ్చరించారు. అర్ధరాత్రి వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థి నాయకులు, ఉద్యమకారులను అరెస్టు చేయడం సిగ్గుమాలిన చర్య అని, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలంటే రేవంత్‌రెడ్డి సర్కారుకు భయం ఎందుకని, గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలను తమ ప్రభుత్వ ఉద్యోగాలుగా చెప్పుకోవడం సిగ్గుచేటని, జాబ్ క్యాలెండర్ విడుదల చేసినప్పటికీ ఉద్యోగాల సంఖ్యలేదని, ప్రతి విద్యార్థినికి ఇస్తామన్న స్కూటీ హామీ ఏమైందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు నేడు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయడం సిగ్గుచేటు అని, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థులకు ఇస్తామన్న హామీలు నెరవేర్చాలని కోరితే పోలీసులు అరెస్టులు చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అరెస్ట్ అయినవారిలో పార్టీ యూత్ నాయకులు బొల్లికొండ వీరేందర్, పాలమాకుల కొమరయ్య, పోలపల్లి రామ్మూర్తి, విద్యార్థి నాయకులు కంజల్ల మనోజ్‌కుమార్, సంగని సూర్యకిరణ్, కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీరస్వామి, రాజేశ్, బీఆర్ఎస్ మైనార్టీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ నయూమొద్దీన్, టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, బీఎస్ఎఫ్ ఇన్‌చార్జి కళ్లపల్లి ప్రశాంత్, ఎంఎస్ఎఫ్ ఇన్‌చార్జి మధు, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి హతిరాం ఉన్నారు.

సీఎం రాక.. స్కూళ్లకు సెలవు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తున్న క్రమంలో స్కూళ్లకు మంగళవారం సెలవు ప్రకటించారు. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించేందుకు సీఎం వస్తున్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే చర్యలు చేపట్టారు. సీఎం పర్యటించే రూట్లలో, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మైదానంలో నిర్వహించే సభ కోసం పాఠశాలలకు ముందే హాలీడే ఇవ్వాలని డీఈవో డి.వాసంతి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో స్కూళ్లకు సెలవు ఇచ్చారు.

దళిత బంధు అమలు చేయాలి

అమరవీరుల జంక్షన్ వద్ద దళితుల నిరసన

సుబేదారి, నవంబర్ 19: దళితబంధు పథకం అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా మంగళవారం హనుమకొండ అమరవీరుల జంక్షన్ వద్ద దళితులు నిరసన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా దళితులకు ఎలాంటి పథకాలు అమలు చేయలేదని, వెంటనే దళితబంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతుండగా పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేయడం సిగ్గుచేటని నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేషన్ షాపులకు చేరిన బియ్యం

'నమస్తే' ఎఫెక్ట్

బియ్యాన్ని పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్

ఐనవోలు, నవంబర్ 19: మండలంలోని కొన్ని రేషన్‌షాపులకు గడువు ముగిసినా 'బియ్యం ఇంకా రాలేదు' శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ఈ నెల 18న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం బియ్యం సరఫరా కాని 13 రేషన్ షాపులకు సరాఫరా చేశారు. రేషన్ షాపుల నిర్వాహకులు సాయంత్రం రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

డీసీఎం డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు, నవంబర్ 19: మండల కేంద్రానికి చెందిన ఇప్పురాజు(39) మంగళవారం కాలినడకన వస్తుండగా స్థానిక బీరన్న గుడి వద్ద డీసీఎం వ్యాన్ ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. హనుమకొండలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్సపొందుతున్నాడు. కాగా, నిర్లక్ష్యంగా నడిపిన డీసీఎం వ్యాన్ డ్రైవర్ దిల్‌బాజ్‌పై చర్యలు తీసుకోవాలని క్షతగాత్రుడి తమ్ముడు శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేయూలో ప్రాంగణ నియామకాలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 19: కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. హైదరాబాద్ మేధా సర్వో డ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల విదార్థులు సుమారు 267 మంది హాజరై పరీక్ష రాశారు. వివిధ విభాగాలవారీగా ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్-139, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్-91, మెకానికల్ ఇంజినీరింగ్ నుంచి 37 మంది ప్రాథమిక రాత పరీక్షలో పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గుడిసెవాసులు

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి

హనుమకొండ, నవంబర్ 19: హనుమకొండ శ్రీదేవి ఏషియన్ మాల్ పక్కనున్న అంబేద్కర్‌నగర్, జితేందర్‌సింగ్ నగర్ గుడిసెవాల బస్తీ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అంబేద్కర్‌నగర్‌లో గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను వెంటనే కేటాయించాలని డిమాండ్ చేశారు. సుబేదారి పోలీసులు చేరుకొని నిరసన విరమించాలని వారికి సూచించారు. తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రభుత్వం వెంటనే కేటాయించాలని నినాదాలు చేశారు. ఆయా నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. కమిటీ నాయకులు సౌరం రఘు, మంద సంపత్, దరికి రమేశ్, వంగాల రాజశేఖర్, ఎర్ర రూప, గడ్డం నీలా, కొయ్యడ కృష్ణ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులను సన్మానిస్తున్న క్రీడాభిమానులు

కాజీపేట, నవంబర్ 19: కాజీపేట పట్టణానికి చెందిన ముగ్గురు పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు గోల్డ్‌మెడల్స్ సాధించడంతో స్థానిక క్రీడాభిమానులు మంగళవారం ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని విక్టోరియా ప్లేగ్రౌండ్‌లో ఈనెల 17న స్పోర్ట్స్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ జోన్‌స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మహ్మద్ జాఫర్, పోలు శ్యామ్‌సుందర్ ముదిరాజ్, కుక్కల ఉమా సాయిలు పలు విభాగాల్లో సత్తా చాటి గోల్డ్‌మెడల్ గెలుచుకున్నారు. దీంతో వారిని క్రీడాభిమాని కేదారి యాదవ్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణానికి చెందిన ముగ్గురు క్రీడాకారులు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో డిసెంబర్ 7 నుంచి 12 వరకు జరిగే సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించడం సంతోషంగా ఉందన్నారు. సీనియర్ క్రీడాకారులు శ్రీనివాస్, ఉడుతల బాబురావు, కృష్ణ, సారంగపాణి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా